# సాక్షి
## జోగులాంబ గద్వాల

ఆదివారం । 21 । జూలై । 2024




### సుదర్శన హోమం..
నాగర్‌కర్నూల్‌లో శనివారం సుదర్శన హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

వివరాలు 10లో ▸



### సమస్యలు పరిష్కరిస్తాం
కోర్టుల్లోని సమస్యలు పరిష్కరిస్తామని హైకోర్టు న్యాయమూర్తి శ్రీదేవి తెలిపారు.

వివరాలు 10లో ▸

### వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 27.4 /24.8

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### వర్షాకాలంలో చిన్నారులపై జాగ్రత్త వహించాలి



గట్టు: వర్షాకాలంలో పాఠశాలకు వచ్చే చిన్నారుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం బోయలగూడెం ఉన్నత పాఠశాలను మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను విద్యార్థులు, ఉపాధ్యాయుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ముసురు వర్షాల నేపథ్యంలో పాఠశాలకు వచ్చే విద్యార్థుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలపై కప్పు గది లీకేజీ కారణంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల కొరతను గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. బోయలగూడెం పాఠశాల సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్నం భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను సరిత కోరారు. ఇదిలాఉండగా, అంతంపల్లి గ్రామానికి చెందిన శివరాము ఇటీవల జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైన తరుణంలో మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, ధరూరు మాజీ జెడ్పీటీసీ పద్మలు సన్మానించి అభినందించారు.

### నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బిజినేపల్లి: వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరం 6వ తరగతిలో ప్రవేశానికి గాను ఉమ్మడి జిల్లాలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు తమ పాఠశాల హెచ్‌ఎం సంతకంతో కూడిన ధ్రువపత్రం, ఫొటోతో సెప్టెంబర్ 16వ తేదీలోగా www.Navodaya.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అర్హత పరీక్ష నిర్వహించి, ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

### శనైశ్వరుడికి తిలతైలాభిషేకాలు



బిజినేపల్లి: శనిదోష నివారణ కోసం శనివారం నంది వడ్డెమాన్‌లో జ్యేష్ఠాదేవి సమేత శనైశ్వరుడికి భక్తులు తిలతైలాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి వేదమంత్రోచ్చారణల మధ్య గోత్రనామార్చన, అభిషేకాలు చేశారు. అనంతరం శివాలయాన్ని సందర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు శాంతికుమార్, ఉమామహేశ్వర్, జయంత్, సిబ్బంది గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### వేరుశనగ క్వింటా రూ.4,471

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు శనివారం 166 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్ఠం రూ. 4471, కనిష్ఠం రూ. 1701, సరాసరి రూ. 3260 ధరలు పలికాయి.

# దోమలను అరికడతాం..




అయిజ మున్సిపల్ కమిషనర్ సత్యంబాబు

### ప్రతి వార్డులో విధిగా ఫాగింగ్ చేపడతాం

- సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టేందుకు కృషి
- పారిశుద్ధ్యమే లక్ష్యం
- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో అయిజ మున్సిపల్ కమిషనర్ సత్యంబాబు

స్థానిక మున్సిపాలిటీలో ప్రధానంగా దోమలను అరికట్టేందుకు ప్రతి వార్డులో ఫాగింగ్ చేపడతామని.. మురుగు, అపరిశుభ్రంగా ఉండే ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించడంతోపాటు నీరు నిల్వ ఉండే కుంటల్లో ఆయిల్‌బాల్స్ వేస్తామని.. ప్రతి రోజు డ్రెయినేజీల్లో మురుగు తొలగించడంతో పాటు, ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించడంతోపాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూస్తామని అయిజ మున్సిపల్ కమిషనర్ సత్యంబాబు అన్నారు. శనివారం అయిజ పుర కార్యాలయంలో 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించగా.. భారీ స్పందన వచ్చింది. పట్టణ నలువీధుల నుంచి ఫోన్‌కాల్స్ వచ్చాయి. ఎంతోకాలంగా వేధిస్తున్న పారిశుద్ధ్య సమస్యలను ఆయా కాలనీలవాసులు మున్సిపల్ కమిషనర్ ఎదుట ఏకరువు పెట్టారు. ప్రతి కాల్‌కు స్పందించిన కమిషనర్ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

– అయిజ

**ప్రశ్న:** ఉప్పలదొడ్డిపేట నుంచి ఉత్తనూరు రోడ్డు వరకు మట్టిరోడ్డు ఉంది. సీసీరోడ్డు, డ్రైనేజీలు నిర్మించకపోవడంతో రోడ్డు మొత్తం బురదమయంగా మారి వాహనాలు వెళ్లేందుకు రావట్లేదు. మురుగుతో దోమల బెడద తీవ్రమైంది. సమస్య పరిష్కరించాలి.

– రామచంద్రారెడ్డి, పాతబస్టాండ్ కాలనీ, అయిజ

**కమిషనర్:** కొందరు వ్యక్తులు రోడ్డును ఆక్రమించుకున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ముందుగా సర్వేయర్‌తో ఆప్రాంతాన్ని సర్వే చేయిస్తాం. అనంతరం సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి మురుగు సమస్య లేకుండా చూస్తాం.

**ప్రశ్న:** భరత్‌నగర్, టీచర్స్ కాలనీ, నరసింహ కాలనీల్లో డ్రైనేజీలు నిర్మించలేదు. ఇళ్ల నుంచి వచ్చే మురుగు రోడ్లనే నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది.

– భగత్‌రెడ్డి, 8వ వార్డు, భరత్‌నగర్

**కమిషనర్:** మురుగు ఎక్కడా నిలువకుండా ఉండకుండా గుంతల్లో మట్టిని వేయించే కార్యక్రమం చేపడుతాము. తేమ ఉండే ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించడంతోపాటు, ప్రతి రోజూ ఫాగింగ్ చేయిస్తాము. నిధులు మంజూరైతే సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తాం.

**ప్రశ్న:** 17వ వార్డులో రోడ్డు నిర్మించేందుకు మట్టిని తొలగించి వదిలేశారు. సీసీ రోడ్డు నిర్మించకపోవడంతో వర్షంనీరు రోడ్డుపై నిలుస్తోంది. చెత్తను సేకరించే వాహనాలు రాకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది.

– ఆనందరాజు, టీచర్స్ కాలనీ, 17 వార్డు

**కమిషనర్:** సీసీ రోడ్డు నిర్మించేందుకు కొన్ని ప్రదేశాల్లో మట్టిని తవ్వారు. అనివార్య కారణాల వలన సీసీ రోడ్డుకు నిధులు విడుదల కాలేదు. వర్షాకాలం కావడంతో మురుగు నిలిచి ఉంది. ముందుగా గుంతలను మట్టితో పూడ్చి వేస్తాం. వీలైనంత త్వరగా సీసీ రోడ్లు వేయించేలా చూస్తాం. చెత్త తరలించే వాహనాలు విధిగా వచ్చేలా చర్యలు చేపడతాం.

**ప్రశ్న:** వర్షాకాలంలో భరత్‌నగర్‌లోని లోతట్టు ప్రాంతం జలమయమవుతోంది. నీరు ఎక్కువ రోజులు అలాగే ఉండడంతో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉంది. డ్రెయినేజీల్లోని మురుగు సైతం బయటకు వస్తోంది. తగు చర్యలు చేపట్టాలి.

– రాంప్రసాద్, భరత్‌నగర్, 8వ వార్డు

**కమిషనర్:** ప్రధానంగా ఓపెన్ ప్లాట్‌లో మురుగు నిల్వ ఉంటోంది.ఆ ప్రదేశంలో గుంతలు పూడ్చుకోవాలని సదరు స్థల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. నోటీసుకు స్పందించి గుంతలు పూడ్చుకుంటే మున్సిపల్ నిధులతో పని పూర్తి చేస్తాం. స్థల యజమాని నుంచి డబ్బు రికవరీ చేస్తాం.

**ప్రశ్న:** ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించకపోవడంతో రోడ్లు బురదమయంగా మారాయి. వర్షాకాలంలో రోడ్డుపై కాలు పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. కనీసం డ్రైనేజీలు నిర్మించాలి.

– మద్దిలేటి, ఎస్సీకాలనీ, 16వ వార్డు

**ప్రశ్న:** కమతంపేటలో గతంలో నిర్మించిన డ్రైనేజీలు శిథిలమయ్యాయి. కాల్వలో నుంచి మురుగు బయటకు పారుతుండగా అందులో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. పలువురు రోగాల బారిన పడుతున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించండి.

– యువ తేజేశ్వర్‌రెడ్డి, 11వ వార్డు, అయిజ

**కమిషనర్:** శిథిలమైన డ్రైనేజీలను తొలగించి వాటి స్థానంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మించేందుకు ప్రణాళిక తయారు చేస్తాం. నిధులు మంజూరైన వెంటనే నిర్మాణం చేపడుతాం. అప్పటి వరకు పాత డ్రైనేజీల్లో విధిగా మురుగు తొలగించేలా చూస్తాం.

**కమిషనర్:** నివాస గృహాల మధ్య దూరం చాలా ఎక్కువగా ఉండడంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి ఎక్కువ మొత్తంలో నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం అంత మొత్తంలో నిధులు లేవు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు కావాలని ప్రభుత్వానికి నివేదిక పంపుతాము.

**ప్రశ్న:** బుడగ జంగాల కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించలేదు. దీంతో మురుగు ఇళ్ల మధ్య పారుతోంది. దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చూడండి.

– ఎల్లప్ప, బుడుగజంగాల కాలనీ

**కమిషనర్:** సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పనులు చేపడుతాం. దోమల నివారణకు ఆయిల్‌బాల్స్ వేయడంతో పాటు ఫాగింగ్ చేపట్టేలా ఆదేశిస్తాం.

**ప్రశ్న:** 7వ వార్డులోని మా ప్రాంతానికి రోజుల తరబడి చెత్త బండి రావడంలేదు. కాలనీవాసులు ఇళ్లలోని చెత్తను రోడ్డు పక్కన వేస్తున్నారు. వర్షాకాలంలో ఆ పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. చెత్తను సేకరించే రిక్షాలను కాలనీకి పంపించండి.

– కోటేశ్వర్‌రెడ్డి, రాయచూర్ రోడ్డు కాలనీ, 7వ వార్డు

**కమిషనర్:** చెత్తను సేకరించే వాహనాలను ప్రతి కాలనీకి పంపుతున్నాం .ఒకవేళ ఏ కాలనీకి అయినా వాహనం రాకపోతే సదరు కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయండి. అదేవిధంగా చెత్తను వేసేందుకు షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ప్రత్యేకమైన చెత్త బాక్సులను ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తాం.

# వీధి కుక్కలతో.. భయం.. భయం

### రాత్రివేళ సంచారమంటేనే హడల్



గద్వాలలో స్వైర విహారం చేస్తున్న కుక్కలు

- రెండు నెలల్లో సుమారు 300మందికి కుక్కకాటు
- రూ.30లక్షలతో ఏబీసీ కేంద్రం నిర్మించినా నిరుపయోగం

గద్వాల: మున్సిపల్ పట్టణాలలో కుక్కల స్వైర విహారం ఎక్కువైంది. వీధుల్లోనే కాదు.. ప్రధాన రోడ్లపై కూడా జనాన్ని వెంటాడుతున్నాయి. దీంతో బయటకు వెళ్లాలంటనే స్థానికులు జంకుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. నిత్యం ఏదో ఓ చోట వాటి బారిన పడి ఆసుపత్రి పాలవుతున్నారు. వీధికుక్కల సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు మాత్రం కనిపించడం లేదు. దీంతో అధికారులు, పాలకుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**జిల్లాలో ఇలా..**

జిల్లాలో గద్వాల, అయిజ, అలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. ప్రతి మున్సిపాలిటీలో ప్రజలు కుక్కల బాధను భరిస్తూనే ఉన్నారు. జిల్లా కేంద్రంలోనే సుమారు వెయ్యి వరకు కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మిగతా మున్సిపాలిటీలలో సైతం పెద్ద సంఖ్యలు కుక్కలు సంచరిస్తున్నాయి. ఆయా పట్టణాలలో రాత్రివేళ అయితే ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే సమస్యగా పరిణమించింది. వాహనదారులు వెళ్లినా వారి వెంట పరుగెత్తి దాడి చేయడం పట్ల భయాందోళనలు చెందుతున్నారు. దీంతో పాటు అకస్మాత్తుగా డివైడర్లపై నుంచి కుక్కలు రోడ్లపైకి రావడంతో వాహనదారులు అయోమయానికి గురై కింద పడి గాయపడుతున్నారు. ఇలాంటి సంఘటనలు జిల్లాకేంద్రంలో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. గద్వాల పట్టణంలో గడిచిన రెండు నెలల్లోనే సుమారు మూడు వందల మంది వరకు కుక్కకాటు బారినపడి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందారంటే పరిస్థితి తీవ్రతను అర్థంచేసుకోవచ్చు. ఇంకా చాలా మంది కుక్కకాటు బాధితులు ఉన్నప్పటికి ఆ సంఘటనలు వెలుగులోకి రావడం లేదు.

### వీధి కుక్కలను అరికట్టాలి



వీధి కుక్కలను అరికట్టే బాధ్యత మున్సిపాలిటీపై ఉన్నా ఆ దిశగా అధికారులు ముందుకెళ్లడం లేదు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఫలితంగా కుక్కల స్వైర విహారం చేసి గాయపర్చుతున్నాయి. కుక్కల నియంత్రణకు తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలి.

– అనిల్‌కుమార్, గద్వాల

### ఇబ్బందులు రాకుండా చర్యలు



కుక్కలతో ప్రజలకు ఇబ్బందుల రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆ దిశగా ఇప్పటికే సిబ్బందిని ఆదేశించాం. కుక్కల బెడదపై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. దీనిపై కౌన్సిల్‌లో చర్చించి జంతు సంరక్షణ నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటాం.

– శంకర్‌సింగ్, కమిషనర్, గద్వాల

### జిల్లాలో ఇటీవల దాడి ఘటనలు

- గద్వాలలోని శ్రీనివాస కాలనీలో ఇంటి ముందున్న వృద్ధుడు బుచ్చన్నపై వీధికుక్క విచక్షణ రహితంగా దాడిచేసింది. తీవ్రంగా గాయపడిన బుచ్చన్నను కర్నూలు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.
- మూడు రోజుల క్రితం రాజీవ్‌మార్గ్ రోడ్డులో రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న రంగన్న అనే వాహన దారుడిని వెంబడించి కుక్కలు గాయపరిచాయి. నెలరోజుల క్రితం భీంనగర్ ప్రధాన రహదారిపై సవారన్న అనే వ్యక్తిని కుక్కలు గాయపరిచాయి.
- షేరెల్లివీధి, మోహిన్‌మహల్లా, బుర్దపేట, రెవెన్యూకాలనీ, నల్లకుంట, హౌసింగ్‌బోర్డు కాలనీ తదితర ప్రాంతాలలో ఇంటి ముందు ఉన్న మహిళలను, పాదచారులను కుక్కలు కరిచి గాయపరిచిన సంఘనటలు ఇటీవల జరిగాయి. వారందరూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్సలు పొంది కోలుకున్నారు.
- అయిజ, వడ్డేపల్లి, అలంపూర్ పట్టణాలలో సైతం కుక్కల బారిపడి ఆసుపత్రుల పాలయ్యారు. వడ్డేపల్లి పట్టణంలో వీటి తీవ్రత ఎక్కవగా ఉంది.

### రూ.30 లక్షలతో ఏబీసీ కేంద్రం

పట్టణంలో వీధి కుక్కల సంతతిని అరికట్టేందుకు గద్వాలలో రూ.30 లక్షల వ్యయంతో జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని (ఏబీసీసీ) నిర్మించారు. ఇక్కడ శస్త్ర చికిత్సల కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. దీన్ని టెండర్ ప్రతిపాదికన ఓ ఎన్‌జీవో సంస్థకు కాంట్రాక్టు కట్టబెట్టారు. వారు పశు వైద్యులను నియమించడంతో పాటు, కుక్కల పట్టే వారిని కూడా నియమించుకోవాల్సి ఉంటుంది. కాంట్రాక్టు ఒప్పందంలో భాగంగా పశు వైద్యులు కుక్కలకు శస్త్ర చికిత్స చేయడం, ఆ తరువాత వాటికి కొన్ని రోజుల పాటు అక్కడే ఏర్పాటు చేసిన కేజ్‌లో ఉంచి సంరక్షించాలి. వాటికి ఆహారం, తాగునీరు అందించడంతో పాటు రేబిస్ టీకాలను సైతం వేయాల్సి ఉంది. కోలుకున్న తరువాత వాటిని మళ్లీ యధా స్థానంలో వదిలేయాలి. ఇలా చేయడానికి ఒక్కోదానికి రూ.1550 మున్సిపాలిటీ చెల్లించింది. ఇప్పటి వరకు సుమారు 600 కుక్కలను పట్టుకుని సంతానోత్పత్తి కలగకుండా చర్యలు చేపట్టారు. అయితే గత ఏడాదిగా ఎన్‌జీవో సంస్థ పనిచేయడం లేదు. దీంతో కుక్కల సంతానోత్పత్తి నిలిచిపోయింది. ఏబీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేయకుమందు మున్సిపల్ కౌన్సిల్ చొరువ తీసుకుని రాజమండ్రి నుంచి ప్రత్యేకంగా సిబ్బందిని పిలిపించి కుక్కలను పట్టించారు. అలా పట్టుకున్న కుక్కలను ప్రత్యేక వాహనాలలో అటవీ ప్రాంతాలకు తరలించారు. మిగిలిన మున్సిపాలిటీలలో ఏబీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే, హోటళ్లు, ఫంక్షన్ హాల్స్, ఫాస్టుఫుడ్ కేంద్రాలు, మాంసం, చికెన్ దుకాణాలు.. కుక్క ఆహార లక్ష్యతకు చిరునామాగా ఉంటున్నాయి. అక్కడే తిష్టవేసి ఆశ్రయం పొందుతున్నాయి. ఈ క్రమంలోనే గుంపులు గుంపులుగా స్వైర విహారం చేసి స్థానికులను గాయపర్చుతున్నాయి.



గద్వాలలో ఏర్పాటు చేసిన ఏబీసీ కేంద్రం

## పంటల నమోదు పకడ్బందీగా చేపట్టాలి



పుటాన్‌దొడ్డిలో వ్యవసాయ అధికారులకు సూచనలు చేస్తున్న ఏడీఏ సక్రియానాయక్

ఎర్రవల్లిచౌరస్తా: రైతులు వానాకాలంలో సాగుచేసిన పంటల నమోదును పకడ్బందీగా చేపట్టాలని ఏడీఏ సక్రియ నాయక్ సూచించారు. శనివారం ఎర్రవల్లి మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి రైతు వేదికలో అలంపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన వ్యవసాయ అధికారులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై పంట నమోదు, రైతు రుణమాఫీ, రైతు బీమా వంటి పథకాలపై ఏఓలు, ఏఈఓలకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 వానాకాలం సీజన్‌లో రైతులు సాగు చేసిన వివిధ పంట పొలాలను అధికారులు సందర్శించి ఈ నెల 30వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అదే విధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతుల రుణమాఫీ పథకం గురించి ఏవైనా సమస్యలు ఉంటే స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులను నేరుగా సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. అలాగే 2024 రైతు భీమా పథకం కోసం రెన్యూవల్ చేసుకోవాల్సిన రైతులు ఈనెల 30లోపు, కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం వచ్చిన వారు వచ్చే నెల 15లోపు స్థానిక ఏఈఓలను కలిసి నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ఏఓలు అయూబ్, అనిత, సురేఖ, ఏఈఓలు ఉన్నారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత



బాలల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా లీగల్ అధికారి శివ

ఎర్రవల్లిచౌరస్తా: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అని, ఆపదలో ఉన్న బాల, బాలికలు ఏసమయంలోనైనా టోల్‌ఫ్రీ నెంబర్ 1098కి కాల్ చేసి సహాయం పొందవచ్చునని జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి శివ అన్నారు. ఎర్రవల్లి మండలంలోని కొండేరులో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బాలలకు ఎదురయ్యే వివిధ సమస్యలు, బడిబయటి పిల్లలు, బాల్య వివాహాల వల్లే కలిగే అనర్థాలు వివరించారు. బాలలపై ఎలాంటి వేదింపులు గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామ కమిటి సభ్యులకు ఉంటుందన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా అనాథ పిల్లలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ టీం సభ్యులు జయ్యన్న, లక్ష్మి, మహిళా సంఘాల సభ్యులు, ఆశాలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## జూరాలకు సందర్శకుల తాకిడి

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద సందర్శకులు తాకిడి పెరిగింది. శనివారం జూరాలకు వరద రావడంతో 17 గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేశారు. జాలువారే నీటిని తిలకించేందుకు సందర్శకులు జూరాలకు తరలి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరు జల్లులు కురుస్తున్నప్పటికీ .. చిన్నారులు, యువకులు అక్కడే ఉండి ఆ సుందర దృశ్యాలను వారి మొబైళ్లలో బంధించేందుకు పోటీ పడ్డారు. సెల్ఫీలు దిగారు. కొత్త నీటి రాక జూరాల ప్రాజెక్టు కళకళలాడుతోంది. ఆదివారం మరింత ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉండడంతో పాటు సందర్శకులు కూడా ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది.

– ధరూరు



ప్రాజెక్టు వద్ద నీటి రాకను తిలకిస్తున్న పర్యాటకులు



జూరాల వద్ద ఫొటో దిగుతున్న కొత్తకోటకు చెందిన ఓ కుటుంబ సభ్యులు

## 'స్థానిక సంస్థలను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్'

వనపర్తిటౌన్: అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఇచ్చిన ఆరు హామీలు నెరవేరుస్తామని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రంలో గద్దెనెక్కిందని బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గసభ్యుడు మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఓ గార్డెన్స్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై రాజకీయ, వ్యవసాయ తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకోవడంపై చూపుతున్న ఆసక్తి, ఉత్సాహం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికలు జరపకపోవడంతో గ్రామాలకు నిధులు రావడం లేదని, కేంద్రం నుంచి వచ్చిన నిధులను సైతం పక్కదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను పదేళ్లలో కేసీఆర్ అప్పుల ఊబిలోకి నెడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని నాశనం చేస్తోందని ఆరోపించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని వదిలిపెట్టమని హెచ్చరించారు. పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టి రుణమాఫీ చేశామని కాంగ్రెస్ గొప్పలు చెప్పుకుంటుందని.. ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, పట్టాదారులు, కౌలు రైతులకు రైతుభరోసా అందించాలని కోరారు. సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి



బీచుపల్లి వద్ద నిండుకుండలా ప్రవహిస్తున్న కృష్ణానది



కృష్ణా పుష్కరఘాట్ వద్ద శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఇలా..

# కృష్ణమ్మ పరవళ్లు

**మక్తల్/కృష్ణా/కొల్లాపూర్/ఎర్రవల్లి చౌరస్తా/పెంట్లవెల్లి:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేయడంతో కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. నీటి పొంగులతో బిరబిరామంటూ ముందుకు సాగుతోంది. కృష్ణానదిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతూ వస్తోంది. శనివారం మక్తల్ మండలంలోని పస్పుల ఘాట్ వరకు కృష్ణాజలాలు చేరుకున్నాయి. కృష్ణా పుష్కర ఘాట్ జలకళను సంతరించుకొని చూపరులకు కనువిందు చేస్తోంది.

- జూరాల నుంచి 17 గేట్లను ఎత్తి దాదాపుగా 1.04 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతుండటంతో బీచుపల్లి వద్ద కృష్ణానది నిండుకుండలా ప్రవహిస్తోంది. గతంలో నదిలో నీరులేక వెలవెలబోయిన కృష్ణమ్మ.. ప్రస్తుతం వరదతో చూపరులను ఆకట్టుకుంటోంది.
- కొల్లాపూర్ నియోజకవర్గంలో శ్రీశైలం బ్యాక్ వాటర్ లెవెల్స్ పెరిగాయి. కృష్ణానది నీటిమట్టం పెరుగుతుండడంతో మత్స్యకారులు తమ వలలు, పుట్టీలు, బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరద ఉధృతి పెరగడంతో సోమశిల అందాలను తిలకించేందుకు పర్యాటకులు తరలివచ్చారు. పర్యాటక కాటేజీల (మృగవాణి) వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు కాలినడకన వచ్చే వారికి, ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది.
- పెంట్లవెల్లి మండలంలోని మంచాలకట్ట, జటప్రోలు, మల్లేశ్వరం, సోమశిల ప్రాంతాల్లో కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది. నదీ తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. కృష్ణానదికి వరద పెరిగే అవకాశం ఉన్నందున ముందజాగ్రత్తలు పాటించాలని సూచించారు.



సోమశిల సమీపంలో కృష్ణానది ప్రవాహం



మక్తల్ మండలం పస్పుల ఘాట్‌కు చేరిన కృష్ణాజలాలు

# జూరాలకు పోటెత్తిన వరద

**17 క్రస్టు గేట్ల ఎత్తివేత.. శ్రీశైలం వైపు కృష్ణమ్మ పరుగులు**

- 90,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1,04,416 క్యూసెక్కుల ఔట్ ఫ్లో
- 11 యూనిట్లలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



జూరాల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

**ధరూర్/రామన్‌పాడు/దోమలపెంట/ఆత్మకూర్:** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద అంతకంతకూ పెరుగుతోంది. శనివారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 83 వేల క్యూసెక్కులు వచ్చిన ఇన్‌ఫ్లో.. 9గంటల సమయానికి 90 వేలకు పెరిగింది. దీంతో ప్రాజెక్టులోని 17 క్రస్టు గేట్లను ఎత్తి 66,810 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. విద్యుదుత్పత్తి నిమిత్తం 33,084 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 85, కుడి కాల్వ ద్వారా 672, ఎడమ కాల్వకు 870, కుడి కాల్వకు 467, సమాంతర కాల్వకు 300, భీమా లిఫ్ట్–1కు 1,300, లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులు కలిపి మొత్తం 1,04,416 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.798 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

- ఎగువనున్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 65,480 క్యూసెక్కుల వరద వస్తుండగా.. 65 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 123.081 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 97.416 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు సాయంత్రానికి 91,263వేల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టు వద్ద 22 గేట్లను ఎత్తి 1,08,860 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 33.31 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 29.615 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

**శ్రీశైలానికి 81 వేల క్యూసెక్కులు**

జూరాలలో విద్యుదుత్పత్తి, ఆనకట్ట గేట్లు పైకెత్తి దిగువన శ్రీశైలానికి వరద నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో శనివారం సాయంత్రం వరకు శ్రీశైలానికి 81,157 క్యూసెక్కుల వరద వచ్చింది. ప్రస్తుతం శ్రీశైలంలో 813.7 అడుగుల వద్ద 36.5568 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో శ్రీశైలం జలాశయంలో 64 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.



క్రస్టుగేట్ల నుంచి విడుదల అవుతున్న నీరు

**రామన్‌పాడులో 1,019 అడుగులు**

రామన్‌పాడు జలాశయంలో శనివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,019 అడుగుల నీరు ఉంది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 870 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని వదులుతుండగా.. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో ప్రాజెక్టులోని కాల్వలు, వివిధ లిఫ్టుల ద్వారా 1,322 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వదిలామని ఏఈ రనీల్‌రెడ్డి చెప్పారు.

## విద్యుదుత్పత్తి లక్ష్యం చేరుకుంటాం..

జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుందని జెన్‌కో సివిల్, ఎలక్ట్రికల్ ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ అన్నారు. శనివారం దిగువ జూరాలలోని జల విద్యుత్ ఉప కేంద్రాన్ని సందర్శించారు. జూరాలకు వరద ఇదే స్థాయిలో కొనసాగితే ఈ ఏడాది లక్ష్యానికి చేరుకుంటామన్నారు. ప్రస్తుతం ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తి చేపడుతున్నామన్నారు. ఎగువ జూరాలలోని ఉపకేంద్రంలో మూడో యూనిట్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఉన్నత స్థాయి అధికారులకు నివేదించామని, ప్రస్తుతానికి అక్కడ విద్యుదుత్పత్తి చేపట్టడం లేదన్నారు. కార్యక్రమంలో డీఈలు పవన్‌కుమార్, రాజు, రూపేష్, ఈఈ దర్బార్‌వలీ పాల్గొన్నారు.



దిగువ కేంద్రంలో విద్యుదుత్పత్తిని పరిశీలిస్తున్న ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్

## క్లుప్తంగా

### కోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్



**పాలమూరు:** రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం నాలుగు బెంచీలు ఏర్పాటు చేసి కుటుంబ తగాదాలు, డీవీసీ కేసులు, మనోవర్తి కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఆర్. శ్రీదేవి, కె.భావన, బెంచ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో గొర్రెలు మృత్యువాత



**తాడూరు:** విద్యుదాఘాతంతో తొమ్మిది గొర్రెలు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. తాడూరుకు చెందిన మెంట మల్లయ్య పెంచుకుంటున్న గొర్రెలను మేత కోసం తీసుకెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో దగ్గర్లో ఉన్న రేకుల షెడ్‌లో ఉంచాడు. షెడ్‌పై ఉన్న విద్యుత్ మేన్ లైన్ తీగలు రేకులపై పడడంతో షెడ్ కింద ఉన్న గొర్రెలు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాయి. తొమ్మిది గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. గొర్రెల విలువ దాదాపు రూ.లక్ష 40 వేల వరకు ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు. అధికారులు పరిశీలించి ప్రభుత్వం పరంగా ఆదుకోవాలని కోరాడు. సంఘటన స్థలాన్ని విద్యుత్ ఏఈ శ్రీరాములు పరిశీలించారు.

# వరుస చోరీల నిందితుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

**మహబూబ్‌నగర్ క్రైం:** ఇంట్లో ఖర్చులు పెరిగిపోవడంతో పాటు తీసుకున్న అప్పులు చెల్లించడానికి చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఆటో డ్రైవర్ మరో మహిళతో కలిసి వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేయడం మొదలపెట్టారు. మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఐదు చోరీలు చేశారు. ఈ ఘటనలపై ఈనెల 19న 'సాక్షి' దినపత్రికలో వృద్ధ మహిళలే లక్ష్యంగా శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పోలీసులు రెండు రోజుల వ్యవధిలో ఇద్దరిని పట్టుకున్నారు. ఈ కేసుపై శనివారం మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. మక్తల్ మండలం రుద్రసముద్రం చెందిన షేక్ మహ్మద్ పదేళ్లుగా పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో నివాసం ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇంటి ఖర్చులకు, తీసుకున్న రుణాలకు డబ్బులు సరిపోక అదే ఏరియాకు చెందిన ఉమా అనే మహిళతో కలిసి చోరీలు చేయాలని పథకం వేశాడు. దీంతో రోడ్లపై ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళ ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని అలాంటి వారిని ఆటోలో ఎక్కించుకుని నవాబుపేట రోడ్డు మార్గంలో నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతానికి తీసుకువెళ్లి వారి దగ్గర ఉన్న బంగారం, నగదు ఎత్తుకెళ్లేవారు. మే నెలలో నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు చోరీలు చేయగా ఈనెలలో టూటౌన్ పరిధిలో రెండు, రూరల్ పరిధిలో ఒకటి చేశాడన్నారు. అప్పన్నపల్లి వద్ద చేసిన వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డాడని అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాలు ఒప్పుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. వీరి నుంచి 9తులాల బంగారం, ఆటో సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ గాంధీనాయక్, ఎస్ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# పోలేపల్లి, గంగారంలో చిరుత సంచారం

**బిజినేపల్లి:** మండలంలోని పోలేపల్లి, గంగారం వ్యవసాయ పొలాల్లో చిరుత సంచరిస్తున్నట్లు రైతులు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం పోలేపల్లి చెరువు సమీపంలో చిరుత సంచరిస్తుండగ దూరం నుంచి రైతు తన ఫోన్‌లో వీడియో చిత్రీకరించాడు. శనివారం ఉదయం పోలేపల్లి, గంగారం మధ్య రోడ్డుకు కొద్ది దూరంలో ఉన్న రాళ్ల గుట్టల్లో చిరుత ఉన్నట్లు రైతులు గుర్తించి వెనుదిరిగారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది పోలేపల్లికి చేరుకుని చిరుత సంచారంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ.. చిరుతకు ఎలాంటి హాని తలపెట్టవద్దని, తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఒకవేళ ఏమైన హాని తలపెడితే వారిపై కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. గంగారం అటవీ ప్రాంతంలో నాలుగు చిరుతలు ఉన్నట్లు గుర్తించామన్నారు. రైతులు గంపులుగా వెళ్లి వ్యవసాయం చేసుకోవాలని, పశువుల్ని ఇళ్ల వద్దనే ఉంచుకోవాలని సూచించారు.

**ఐదు రోజుల్లో మూడుసార్లు చిరుత దాడి**

**భూత్పూర్:** మండలంలోని ఎల్కిచర్లలో శుక్రవారం రాత్రి చిరుత దాడిలో అంజన్‌రెడ్డి పశువుల పాకలో దూడ మృతి చెందింది. ఐదు రోజుల వ్యవధిలో మూడు సార్లు చిరుత దాడిలో ఐదు పశువులు మృత్యువాత పడ్డాయి. మంగళవారం రాత్రి తిరుపతిరెడ్డికి చెందిన దూడ, గురువారం రాత్రి బాలప్పకు చెందిన రెండు దూడలు, చెన్నారెడ్డికి చెందిన ఓ దూడ, శుక్రవారం రాత్రి అంజన్‌రెడ్డికి చెందిన దూడ చిరుత దాడిలో మృతి చెందాయి. గ్రామస్తులు, పాడి రైతులు తమ వ్యవసాయ పొలాల నుంచి చీకటి పడకముందే ఇంటికి చేరుకోవాలని, ఉదయం సూర్యోదయం అయిన తర్వాత తమ పనులు తాము చేసుకోవచ్చని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.



ఎల్కిచర్లలో చిరుత దాడిలో మృతి చెందిన దూడను పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

# ఉపాధ్యాయులను నియమించాలని ధర్నా



తుమ్మిళ్లలో ప్రభుత్వ పాఠశాల దగ్గర ధర్నా చేస్తున్న గ్రామస్తులు

**రాజోళి:** ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తుమ్మిళ్ల గ్రామస్తులు శనివారం ధర్నా చేపట్టారు. తుమ్మిళ్ల ప్రభుత్వ పాఠశాలలో 300 మందికి పైగా విద్యార్థులు ఉండగా, ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లలు చదవాలని, ఇతర గ్రామాలకు, ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా, గ్రామంలోనే చేర్పిస్తే, సరైన ఉపాధ్యాయులు లేక పిల్లలు చదువులో వెనకబడుతున్నారన్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉండటంతో ఏ తరగతిలోకి వెళ్లాలో తెలియక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని సిబ్బంది కొరత తీర్చాల్సిన ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. బదిలీలు జరిగిన నేపథ్యంలో ఈ పాఠశాలకు కేటాయింపులు లేకపోవడం, బదిలీపై ఆలస్యం చేయడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రతి ఆటోకు ప్రత్యేక నంబర్ల కేటాయింపు

**మహబూబ్‌నగర్ క్రైం:** జిల్లా కేంద్రంలో ఆటోల ద్వారా ఏదైనా నేరాలు చేసిన.. ఆటోలు చోరీకి గురైన సులువుగా గుర్తించడం కోసం ట్రాఫిక్ పోలీసులు ప్రతి ఆటోకు నంబరు కేటాయిస్తున్నారు. ఆదివారం నుంచి ఈనెల 25వరకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో నంబర్లు వేసే విధంగా ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్, యాజమాని ఆటోలకు సంబంధించి ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు తీసుకుని రావాల్సి ఉంటుంది. ఇప్పటికే పైలెట్ కింద నాలుగు ఆటోలకు నంబర్లు ఇచ్చినట్లు ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. నంబర్లు ఇవ్వడం వల్ల ఎన్ని ఆటోలు ఉన్నాయి అనేది స్పష్టంగా తెలియడంతో పాటు ఏదైనా నేరాలు జరిగిన సందర్భాల్లో సులువుగా గుర్తించడానికి అవకాశం ఉంటుందని వెల్లడించారు.

## వర్షానికి కల్వర్టు ధ్వంసం

**నవాబుపేట:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నవాబ్‌పేట మండలంలోని మల్లారెడ్డిపల్లి – యన్మన్‌గండ్ల రోడ్డు కల్వర్టు ధ్వంసమైంది. చెరువు వద్ద రోడ్డు సగం వరకు కూలిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గతంలో భారీ వాహనాల రాకపోకల కారణంగా కల్వర్టు కొంతమేర కుంగిపోయిందని.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ధ్వంసమైందని స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి, తాత్కాలిక ఏర్పాట్లుచేసి రాకపోకలను పునరుద్ధరించాలని కోరారు.



ధ్వంసమైన మల్లారెడ్డిపల్లి - యన్మన్‌గండ్ల రోడ్డు కల్వర్టు

## ఉమ్మడి జిల్లాలో తహసీల్దార్లు, డీటీల బదిలీ

**సాక్షి, నాగర్‌కర్నూల్:** రాష్ట్రంలోని మల్టీ జోన్ – 2 పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను శనివారం ప్రభుత్వం బదిలీ చేసింది. ఈమేరకు సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో సుదీర్ఘకాలం పాటు పనిచేసిన, స్పౌజ్ కేటగిరీలో పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు బదిలీ అయ్యారు.

| తహసీల్దారు పేరు | పనిచేస్తున్న జిల్లా | బదిలీ అయిన జిల్లా |
|---|---|---|
| జె.సువర్ణరాజ్ | నారాయణపేట | మహబూబ్‌నగర్ |
| సి.నర్సింగరావు | నారాయణపేట | మహబూబ్‌నగర్ |
| ఎల్.జయసుధ | మహబూబ్‌నగర్ | నారాయణపేట |
| జి.కల్యాణి | మహబూబ్‌నగర్ | నారాయణపేట |
| అఖిలప్రసన్న | మహబూబ్‌నగర్ | నారాయణపేట |
| జమీల్ | నాగర్‌కర్నూల్ | నారాయణపేట |
| కె.హిమబిందు | నాగర్‌కర్నూల్ | సూర్యాపేట |
| బి.శ్రీకాంత్ | నాగర్‌కర్నూల్ | సూర్యాపేట |
| వి.సరిత | నాగర్‌కర్నూల్ | సూర్యాపేట |
| రాజేందర్‌రెడ్డి | నాగర్‌కర్నూల్ | సూర్యాపేట |
| భాస్కర్ | జోగుళాంబ గద్వాల | మహబూబ్‌నగర్ |
| కె.శ్రీనివాస్ | వనపర్తి | జోగుళాంబ గద్వాల |
| రామకృష్ణ | వనపర్తి | జోగుళాంబ గద్వాల |
| ఫరీదాబేగం | వనపర్తి | మహబూబ్‌నగర్ |
| అమేర్ | నారాయణపేట | మహబూబ్‌నగర్ |
| హేమ్లా | మహబూబ్‌నగర్ | నాగర్‌కర్నూల్ |
| నారాయణ | నారాయణపేట | నాగర్‌కర్నూల్ |
| కేశవ | జోగుళాంబ గద్వాల | నాగర్‌కర్నూల్ |
| మోతీలాల్ | వనపర్తి | నాగర్‌కర్నూల్ |
| రవికుమార్ | జోగుళాంబ గద్వాల | నాగర్‌కర్నూల్ |
| బాలరాజు | నాగర్‌కర్నూల్ | నారాయణపేట |
| వరలక్ష్మి | నాగర్‌కర్నూల్ | వనపర్తి |
| మల్లికార్జున్ | జోగుళాంబ గద్వాల | వనపర్తి |

# కల్తీ లేని గానుగ నూనె

- ఎద్దు తిప్పుతూ ఆయిల్ తయారీలో గిరిజన యువకుడు
- రోజురోజుకూ ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ



ఎద్దు గానుగతో ఆయిల్ తయారు చేస్తున్న శంకర్‌నాయక్

**నవాబుపేట:** కల్తీ లేని నూనె అంటే కొంచెమైనా కల్తీ ఉంటుంది.. అచ్చం ఏముండదు అనుకుంటాం.. కానీ, కల్తీ లేని ఆయిల్ అంటే మన ముందే ఆయిల్‌ను ఎలాంటి విద్యుత్ లేకుండా కేవలం ఎద్దును తిప్పుతూ గానుగతో తయారు చేసి అందిస్తున్నాడు ఓ గిరిజన యువకుడు. మన ముందే తయారు చేయడం చూస్తే అవును నిజమే కల్తీ లేనే లేదు అని చెప్పక తప్పదు. ప్రస్తుతం ఎక్కడ చూసినా కల్తీ అనే మాటలే వినిపిస్తున్నాయి. కల్తీ పదార్థాలకు గిరిజనులు సులువుగా మోసపోతారని వారిపై రుద్దే ప్రయత్నం చేస్తుంటారు. ఈ క్రమంలోనే తండాల్లోనే కల్తీ లేని నూనె తయారు చేయాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొంటున్నాడు మండలంలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని బాప్‌సింగ్‌తండాకు చెందిన శంకర్‌నాయక్.

**రెండు గంటల్లో.. రెండు కిలోలు**

ఎద్దు గానుగతో రెండు గంటలపాటు శ్రమిస్తే 13 కిలోల దినుసులతో 2 కిలోల ఆయిల్ వస్తుంది. దీని పిప్పిని సైతం కోళ్ల తదితర వాటికి ఆహారంగా వాడుకునే అవకాశం ఉంటుంది. ఒకేసారి 13 కిలోల పల్లీలు, నువ్వులు, కుసుమలు ఇలా ఏదో ఒకటి గానుగలో వేసేస్తే ఎద్దు రెండు గంటలు గానుగను తిప్పుతుంది. దీంతో ఆయిల్ వస్తుంది. కాగా కిలో దినుసులకు రూ.40 చొప్పున డబ్బులు తీసుకుని వారి ముందే నూనె ఇస్తున్నాడు. దినుసులు లేకుండా నేరుగా ఆయిల్ కావాల్సిన వారికి కిలో రూ.450 చొప్పున అందిస్తున్నాడు.

**ప్లాస్టిక్ వాడటం లేదు..**

డిగ్రీ పూర్తి చేసిన నేను తండాలో అందరిలాగే ఉపాధి కోసం ముంబాయికి వలస వెళ్లాలనుకున్న తరుణంలో ఫోన్‌లో చూస్తుండగా గానుగ నూనె తయారీ వచ్చింది. ఈ ఆలోచన నచ్చడంతో తెలిసిన వారి వద్ద రూ.5 లక్షలు అప్పు చేసి గానుగ ఏర్పాటు చేసుకుని నూనె తయారీ ప్రారంభించాను. అలాగే ఆయిల్‌ను టిన్నులు, స్టీల్ డబ్బాల్లో మాత్రమే ఇస్తున్నా. ప్లాస్టిక్‌ను అసలు వాడటం లేదు. ప్రభుత్వం చేయూతనిస్తే దీనిని మరింత వృద్ధి చేసుకుంటాను.

– శంకర్‌నాయక్, బాప్‌సింగ్‌తండా, కొత్తపల్లి గ్రామం

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

"Plot For Sale" 200 yards at Padmavathi Colony, Mahabubnagar, Ph: 9886154400

Urgent Plot For Sale 300 Sq. yards With Basement at Backside of New RTO office Mahboob Nagar. Ph: 9885956158

WANTED

ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుటకు ఇంటిపని,వంటపనికి వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి + భోజనం. జీ. 20 K. ఫోన్: 8977639982, 8977639983

పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర: 9391912949, 040-40123376.

SERVICES

BUSINESS OFFER

We are Ready to Invest Long Term Projects All Over the World. Ph : +91 8754809650

ICF కార్పొరేషన్ అగ్రికల్చర్, బిజినెస్, పర్సనల్, ఎడ్యుకేషన్, ప్రాపర్టీ పైన అమౌంట్ ఇవ్వబడును. ఏజెంట్స్ & DMA కావలెను. జీతం + కమీషన్. ఫోన్: 7988242391

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే

HAPPY BIRTHDAY

HEALTH CARE

ORTHOPEDIC SURGEON

డా॥యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 - 228666, 83412 98666.

GYNECOLOGY

కార్తీక్ హాస్పిటల్, సుంకేసుల రోడ్, కర్నూలు. సంతాన సమస్యలు, స్త్రీ వ్యాధులు, జనరల్, బీ.పి, షుగర్ వ్యాధులకు ఉత్తమ చికిత్స. EHS సౌకర్యం కలదు. డా॥ యస్.చంద్రశేఖర్, M.D. ఫిజిషియన్, డా॥పార్వతీదేవి, M.D.DGO., స్త్రీ వ్యాధి, ల్యాపరోస్కోపి నిపుణులు. టైమింగ్స్:10-8PM, 08518-226162.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్

# యావత్ దేశం దృష్టికి ఆటవిక పాలన

## 24న ఢిల్లీలో నిర్వహించే ధర్నాకు అన్ని పార్టీలను ఆహ్వానిద్దాం : వైఎస్ జగన్

## మనతో కలసి వచ్చే పార్టీలన్నింటినీ కలుపుకుని పోరాటం చేద్దాం

**ఏపీలో సాగుతున్న దారుణకాండను వారికి వివరిద్దాం**

- ఢిల్లీ ధర్నా తర్వాత పార్లమెంటు ఉభయసభల్లోనూ గళమెత్తాలి.. రాష్ట్రంలోని ఘటనలతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం.. అందుకే రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేస్తున్నాం
- అదే విషయంపై పార్లమెంటులో నినదించాలి.. అలా చంద్రబాబుకు గట్టి హెచ్చరికలు పంపాలి
- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ సమావేశంలో ఎంపీలకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ దిశానిర్దేశం



"ఢిల్లీలో ధర్నా కార్యక్రమానికి అన్ని పార్టీలను ఆహ్వానిస్తున్నాం. ఈ పోరాటంలో మనతో వచ్చే అన్ని పార్టీలను కలుపుకుని పోదాం. ధర్నాలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులంతా పాల్గొంటారు. రాష్ట్రంలో కొనసాగుతున్న దారుణకాండను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్దాం. రాష్ట్రంలో గత 45 రోజులుగా ఏం జరుగుతోందో వివరిద్దాం. ధర్నా అనంతరం పార్టీ ఎంపీలు పార్లమెంట్‌కు హాజరవ్వాలి. రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, దాడులు, ఆస్తుల విధ్వంసంపై ఉభయ సభల్లో గట్టిగా మాట్లాడాలి. ఇక్కడ కూటమి ప్రభుత్వం సాగిస్తున్న దురాగతాలను అందరి దృష్టికి తీసుకెళ్లాలి.

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

**సాక్షి, అమరావతి:** ఏపీలో హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసాలు సృష్టిస్తూ చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న దారుణకాండను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్లేందుకు ఢిల్లీలో ఈ నెల 24వ తేదీ బుధవారం నిర్వహించే ధర్నాకు అన్ని పార్టీలను ఆహ్వానిస్తున్నామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. గత 45 రోజులుగా రాష్ట్రంలో ఏం జరుగుతోందో వివరించి.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటంలో కలిసి వచ్చే అన్ని పార్టీలనూ కలుపుకుపోదామని ఎంపీలకు సూచించారు. ధర్నా అనంతరం పార్లమెంట్‌కు హాజరై రాష్ట్రంలో సాగుతున్న ఆటవిక పాలనపై గళమెత్తాలని దిశానిర్దేశం చేశారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కక్షతో చేస్తున్న దురాగతాలను తమ సభల్లోని సభ్యులందరి దృష్టికి తీసుకెళ్లాలని ఉద్బోధించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం ఆయన తాడేపల్లిలోని క్యాంప్ ఆఫీసులో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ఎంపీలకు దిశా నిర్దేశం చేశారు. 'ఇప్పటికే రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర హోం మంత్రి అపాయింట్‌మెంట్లు కోరాం. అపాయింట్‌మెంట్లు రాగానే.. వారికీ ఇక్కడి పరిస్థితిని వివరిస్తాం. ఢిల్లీలో ధర్నా, నిరసన కార్యక్రమానికి సంబంధించి ఒక్కో ఎంపీ ఒక్కో బాధ్యత తీసుకోవాలి. వెంటనే ఢిల్లీ వెళ్లి ఆ పనుల్లో నిమగ్నం కావాలి. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలు ప్రజల్లో మరింత ఆగ్రహానికి దారి తీస్తున్నాయి. అందుకే రాష్ట్రపతి పాలనకు డిమాండ్ చేస్తున్నాం. అలా చంద్రబాబుకు గట్టిగా హెచ్చరికలు పంపాలి. పోరాటం చేయకపోతే దారుణాలకు అడ్డుకట్ట పడదు. అసెంబ్లీ సమావేశాల్లోనూ నిరసన వ్యక్తం చేస్తాం. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించే సమయంలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం. రాష్ట్రంలో దారుణాలు, అరాచకాలు, ఇక్కడ జరుగుతున్న ఘటనలపై అందరూ గళమెత్తాల్సిన అవసరం ఉంది' అని చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

### ప్రజాస్వామ్య మనుగడకే పెను ప్రమాదం

రాష్ట్రంలో జరుగుతున్న ఈ ఘటనలు ఒక పార్టీకి సంబంధించిన అంశం కాదు. అవి ప్రజాస్వామ్య మనుగడకు పెద్ద దెబ్బ. అందుకే అన్ని పార్టీలకూ రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల గురించి వివరించాలి. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల మీద దారుణంగా దాడులు జరుగుతున్నాయి. వినుకొండలో రషీద్ హత్యే ఇందుకు పరాకాష్ట. ప్రజలందరూ చూస్తుండగా, నడిరోడ్డు మీద కత్తితో నరికి చంపిన తీరు అత్యంత అమానుషం. ఆ రాజకీయ హత్య ఘటనను వక్రీకరించడానికి ఎల్లో మీడియా సహాయంతో ప్రభుత్వం నానా ప్రయత్నాలు చేస్తోంది. ఏదో బైక్ కాల్చిన ఘటనకు, ఇప్పుడు జరిగిన దారుణ హత్యకు ముడి పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అసలు తమ కొడుకు ఏం తప్పు చేశాడని రషీద్ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. 'సీఎంగా వైఎస్ జగన్ ఉంటే.. అంతా మంచి జరుగుతుందని నమ్మడం మా తప్పు అవుతుందా?' అని వారు ప్రశ్నిస్తున్నారు. హంతకుడైన జిలానీ.. లోకేశ్ పుట్టిన రోజున, స్థానిక ఎమ్మెల్యే భార్యకు స్వయంగా కేక్ తినిపించిన ఫొటోలను రషీద్ తల్లిదండ్రులు చూపారు. స్థానిక ఎమ్మెల్యేతో కూడా కలిసి దిగిన హంతకుడి ఫొటోలను వారు చూపించారు.

### హత్యలు.. హత్యాయత్నాలు.. విధ్వంసాలు

పల్నాడు జిల్లాకు కొత్త ఎస్పీ వచ్చిన రెండు మూడు రోజుల్లోనే హత్యతో సహా పలు ఘటనలు చోటు చేసుకున్నాయి. అంతకు ముందు మల్లికా గార్గ్ జిల్లా ఎస్పీగా ఉన్నారు. ఆమె సమర్థురాలు. అందుకే ఆమెను ఉద్దేశ పూర్వకంగా బదిలీ చేశారు. తమకు అనుకూలంగా ఉండే ఎస్పీని నియమించుకుని ఈ దారుణాలు చేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ 45 రోజుల్లో 36 మంది రాజకీయ హత్యలకు గురయ్యారు. 300కు పైగా హత్యాయత్నాలు జరిగాయి. తెలుగుదేశం పార్టీ వారి వేధింపులు భరించలేక 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. 560 చోట్ల ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేశారు. 490 చోట్ల ప్రభుత్వ ఆస్తులు సైతం ధ్వంసం చేశారు. ఇవి కాక 1000కి పైగా దౌర్జన్యాలు, దాడులు జరిగాయి.

### ఎంపీపైనా యథేచ్ఛగా దాడి

మరోవైపు తన సొంత పార్లమెంటు నియోజకవర్గంలో, తన తండ్రి ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గంలోనే ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడులు చేశారు. కావాలనే అక్కడ టీడీపీ మనుషులు ఉండేలా, పోలీసులతో ప్లాన్ చేసి మరీ దాడులు చేశారు. మాజీ ఎంపీ రెడ్డప్ప ఒక న్యాయవాది. ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరులో ఆయన ఇంటికి వెళ్తే, రాళ్లతో దాడి చేసి.. వాహనాలు కూడా ధ్వంసం చేశారు. మాజీ ఎంపీ రెడ్డప్పకు చెందిన వాహనాన్ని దగ్ధం చేశారు. అన్ని తప్పులు చేసిన వారే, తిరిగి మన పార్టీ వాళ్ల మీద కేసులు పెడుతున్నారు.

### ప్రజాస్వామ్యానికి విలువ ఉంటుందా?

రాష్ట్రంలో 15 ఏళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రస్థానం సాగుతోంది. చంద్రబాబు ఆశించి నట్టుగా వైఎస్సార్‌సీపీని అణగదొక్కలేరు. ఎవరు అధికారంలో ఉన్నా ఇలాంటి దాడులు మంచివి కావు. అధికారంలో ఉన్న పార్టీ, అధికారంలో లేని పార్టీ మీద దాడులు చేయడం ధర్మమా? ఇలాగైతే ప్రజాస్వామ్యానికి విలువ ఏముంటుంది? గత ఎన్నికల్లో మనం 86 శాతం సీట్లను గెలిచాం. అయినా ఇలాంటి ఘటనలు జరగలేదు. దాడులను ఎప్పుడూ ప్రోత్సహించలేదు. ప్రజలందరినీ సమానంగా చూశాం. ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు కాకపోవడంపై ఎవ్వరూ ప్రశ్నించకూడదన్నదే ఈ ప్రభుత్వ ఉద్దేశం. దీనిపై ఎవరూ నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు చేయకూడదన్నదే ప్రభుత్వ ఆలోచన. అందుకే దగ్గరుండి విధ్వంసకాండను ప్రోత్స హిస్తున్నారు. పార్టీకి కార్యకర్తలు చాలా ముఖ్యం. ఎక్కడ కార్యకర్తలకు నష్టం జరిగినా వెంటనే స్పందించడం, వారిని కాపాడుకోవడం మన బాధ్యత. ఆయా కుటుంబాలకు తోడుగా నిలవాలి. కార్యకర్తలందరి తరఫున గట్టిగా నిలబడాలి.

# హైస్కూళ్ల పనివేళల్లో మార్పు

**ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో పాఠశాలల పనివేళలను రాష్ట్ర ప్రభుత్వం మార్పు చేసింది. ఉన్నత పాఠశాలలు ప్రస్తుతం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వర కు కొనసాగుతుండగా.. ఈ సమయాన్ని అరగంట ముందుకు జరిపింది. ఇకపై ఉన్నత పాఠశాలలు ఉదయం 9 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4.15 గంటలకు ముగుస్తాయి. కాగా, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ప్రస్తుతం కొనసాగుతున్న సమయాలను యథావిధిగా ఉంచిన ప్రభుత్వం.. ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో హైదరాబాద్ జంటనగరాల్లో కూడా ప్రస్తుతం ఉన్నట్టుగానే ఉదయం 8.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం శనివారం ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంలో వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారులను, ప్రాంతీయ సంయుక్త సంచాలకులను ఆదేశించారు.

# 31 వరకు ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు

**బదిలీల షెడ్యూల్ పొడిగింపు.. ఆర్థిక శాఖ ఉత్తర్వులు**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల షెడ్యూల్‌ను పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 3వ తేదీన ఇచ్చిన జీవో ప్రకారం శనివారంతో బదిలీల షెడ్యూల్ ముగియాల్సి ఉండగా.. ఈనెల 31 వరకు పొడిగిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ పూర్తికాని నేపథ్యంలో.. గడువును పొడిగిస్తున్నట్టు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివా రం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆగస్టు 1 నుంచి సాధారణ బదిలీలపై నిషేధం అమల్లోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని ప్రభుత్వ శాఖలు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# దాశరథి పురస్కారానికి జూకంటి జగన్నాథం



**సాక్షి, హైదరాబాద్:** కవి, కథకుడు జూకంటి జగన్నాథంకు రాష్ట్రప్రభుత్వం దాశరథి కృష్ణమాచార్య పురస్కారం ప్రకటించింది. ఈమేరకు శనివారం రాత్రి ఉత్తర్వు జారీ చేసింది. పురస్కార కమిటీ రెండు రోజుల క్రితం భేటీ అయి జూకంటి జగన్నాథం పేరును సిఫారసు చేసింది. ఆయన పేరును ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. త్వరలో జూకంటికి పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనను రూ.లక్షా వేయి నూట పదహార్లు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించనున్నారు.

# అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య పెరిగేలా కార్యాచరణ

- అధికారులకు ఉపముఖ్యమంత్రి భట్టి ఆదేశం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో విస్తారంగా ఉన్న ప్రకృతి వనరులను జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకునేలా అభివృద్ధి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. నగరంలో పెద్ద సంఖ్యలో ఉన్న ఐటీ ఉద్యోగులు ఆయా పర్యాటక ప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపేలా వాటిని అభివృద్ధి చేసే కార్యాచరణ రూపొందించాలని సూచించారు. శనివారం ఆయన పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి బడ్జెట్ సమీక్ష నిర్వహించారు. ఔటర్ రింగురోడ్డు పరిసరాలు, జలాశయాలు, అడవుల వంటి ప్రాంతాలను పర్యాటకులకు స్వర్గధామంలా రూపొందించే అవకాశం ఉందని, ఆ దిశలో చర్యలు తీసుకోవాలని అధికారులను భట్టి ఆదేశించారు. సాంస్కృతిక సారథి కళాకారుల కార్యక్రమాలపై ఆరా తీశారు. సమాజాభివృద్ధికి వారి సేవలను సమగ్రంగా వినియోగించుకునే కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలోని క్రీడా మైదానాలను మెరుగుపరిచి, సంవత్సరం పొడవునా వాటిలో యాక్టివిటీ ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యార్థులకు వాటిల్లో క్రీడాపోటీలు నిర్వహించాలని, అవి ఆక్రమణకు గురికాకుండా చూడాలన్నారు.

సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారి రిజ్వీ, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్, యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారి శ్రీధర్, హెరిటేజ్ తెలంగాణ డైరెక్టర్ భారతి హోళికేరి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, కార్పొరేషన్ ఎండీ ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసరచనలో పీయూ విద్యార్థుల ప్రతిభ

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీ వాణిజ్యశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాణిజ్య-2024 పేరిట నిర్వహించిన కార్యక్రమంలో పీయూ విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో బహుమతులు గెలుపొందారు. ఈ మేరకు రోహిత్‌కు వ్యాసరచనలో మొదటి బహుమతి, పాటల పోటీలో నాషీన్‌కు రెండో బహుమతి వచ్చింది. వారిని రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపల్ చంద్రకిరణ్, కంట్రోలర్ రాజ్‌కుమార్‌లు అభినందించారు.

## కాల్వ పనులకు అడ్డు తగలొద్దు



**భూత్పూర్:** మండలంలోని ఎల్కిచర్ల చెరువుకు వచ్చే కాల్వ పనులకు అడ్డు తగలొద్దని, ప్రభుత్వ పరంగా నష్టపరిహారం చెల్లించేలా కృషిచేస్తానని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఎల్కిచర్లలో ఐదు రోజులుగా పశువులపై చిరుత దాడి చేస్తున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం సాయంత్రం గ్రామంలో పర్యటించారు. అడవి జంతువులను గుర్తించి శివారులోకి రాకుండా చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం ఎల్కిచర్ల చెరువుకు వచ్చే కాల్వలను పూడ్చి వేయడంతో రైతులతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో తమ భూమికి నష్ట పరిహారం ఇవ్వకపోవడంతో కాల్వ పూడ్చివేసినట్లు వివరించారు. కాల్వ పూడ్చి వేయడంతో నాలుగు గ్రామాల ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటారని, ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందిస్తామని, పనులకు సహకరించాలని రైతులను కోరారు. శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, రాంరెడ్డి, మాసగౌడ్, విజయ్‌గౌడ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, జమీర్ ఉన్నారు.

## కేసు నమోదు

**అమ్రాబాద్:** పదర మండలం ఇప్పలపల్లికి చెందిన మేఘావత్ మత్య అదృశ్యమైనట్లు అతని భార్య మల్లిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు. వృత్తిరీత్యా టైలర్ పని చేస్తున్న మత్య తమ ఇంట్లోని పిండి గిర్ని మరమ్మతు కోసం మెకానిక్‌ను తీసుకొస్తానని శుక్రవారం ఇంటి నుంచి బయలుదేరాడు. అతను తిరిగి రాలేదని, ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలియజేశారు.

# సమస్యల పరిష్కారానికి చర్యలు

- హైకోర్టు న్యాయమూర్తి జువ్వాడి శ్రీదేవి

**నారాయణపేట:** కోర్టులో సిబ్బంది కొరత, సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హైకోర్టు న్యాయమూర్తి జువ్వాడి శ్రీదేవి తెలిపారు. శనివారం జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన జ్యుడీషియల్ అధికారుల కాన్ఫరెన్స్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదట జిల్లాకేంద్రంలోని పీఆర్ అతిథి గృహానికి చేరుకోగా కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ, సీనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీనివాస్, అదనపు కలెక్టర్లు మయాంక్ మిత్తల్, అశోక్‌కుమార్, డీఎస్పీ నల్లపు లింగయ్య పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆమె జిల్లా కోర్టు సముదాయానికి రాగా పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్, సభ్యులు, సీనియర్ న్యాయవాదులు ఆమెకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. తర్వాత న్యాయమూర్తుల సమీక్ష సమావేశాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పోలీసు అధికారులతో నెలవారీగా సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నారా ? లేదా ? అని న్యాయమూర్తులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని కోర్టుల్లో సమస్యలు, సిబ్బంది కొరతపై ఆరా తీశారు. కక్షిదారులకు మీడియేషన్ సెంటర్లు ఉన్నాయా అని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని కోర్టుల్లో సిబ్బంది సరిపడా లేరని, జిల్లా కోర్టులో మీడియేషన్ సెంటర్ కూడా లేదని వివరించారు. ఏవైనా కేసులుంటే లోక్ అదాలత్‌లో న్యాయవాదులతో కో-ఆర్డినేషన్ చేస్తామని, ఇటీవల నిర్వహించిన మూడు జాతీయ లోక్ అదాలత్‌లలో 70,803 కేసులను పరిష్కరించామని సమాధానమిచ్చారు. సమీక్షలో జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ ఉమర్ పాల్గొన్నారు. సమీక్ష అనంతరం బార్ అసోసియేషన్ చాంబర్‌లో హైకోర్టు న్యాయమూర్తిని బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు.



హైకోర్టు న్యాయమూర్తి జువ్వాడి శ్రీదేవికి పూల మొక్క అందజేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

### జోగుళాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు..

**జోగుళాంబ శక్తిపీఠం:** అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను శనివారం రాత్రి హైకోర్టు న్యాయమూర్తి జువ్వాడి శ్రీదేవి దంపతులు దర్శించుకున్నారు. వారికి ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రదోశ కాలంలో జరిగే దశవిధ హారతి కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం ఆలయ అర్చకులు క్షేత్ర ప్రాశస్త్యాన్ని వివరించి తీర్థ ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. హైకోర్టు న్యాయమూర్తి దంపతులకు స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కమలాపురం కవిత అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్ న్యాయమూర్తి కుషా, సీనియర్ సివిల్ న్యాయమూర్తి గంట కవిత, డీఎస్పీ సత్యనారాయణ, సీఐ టాటాబాబు, ఎస్ఐలు శ్రీనివాస్‌నాయక్, నాగరాజు, తహసీల్దార్ మంజుల కోర్టు సిబ్బంది చిన్నరాజు ఉన్నారు.



హైకోర్టు న్యాయమూర్తి దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న జూనియర్ సివిల్ న్యాయమూర్తి కవిత

# భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

- కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజి



హోమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి దంపతులు

**నాగర్‌కర్నూల్:** మానవ జీవిత కాలంలో దుష్టశక్తులను సంహరించుటకు ఉపయోగించే అస్త్రాలలో సుదర్శన చక్రం అత్యంత విశిష్ట శక్తి గలదని జగద్గురు పీఠాధిపతి కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజి తెలిపారు. శనివారం అతిరుద్రం, ఆయుత చండీ, శ్రీకాళచక్ర యాగశాల మంటపంలో నిర్వహించిన సామూహిక సుదర్శన లక్ష్మీనారాయణ హోమంలో మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్ రెడ్డి, జమున దంపతులు పాల్గొన్నారు. ప్రాంత భక్తులు విశేషంగా పాల్గొని సేవలు అందించాలని సుదర్శన హోమం వల్ల ఐశ్వర్యం, శ్రేయస్సు పొందవచ్చని, ఇది మనలోని హానికరమైన, విషపూరితమైన శక్తులను శుద్ధి చేయడంలో సహాయపడుతుందని స్వామీజి తెలిపారు. సాయంత్రం సీతారామచంద్రస్వామి పాదక పట్టాభిషేక కార్యక్రమం నిర్వహించారు. రామరాజ్యంలో రాముడు ఎంతో మనోహరమైన పాలనను అందించారన్నారు. ఈనెల 7 నుంచి 21 వరకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న అతిరుద్రం ఆయుధచండి రామాయణ భాగవత హోమాలు, పారాయణం 800 మంది బ్రాహ్మణులచే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హోమ యాగాలలో పాల్గొన్న దంపతులు పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

## 'ఆ భూమి ఆలయానికే చెందాలి'

**పెబ్బేరు రూరల్:** పెబ్బేరులోని 30.19 ఎకరాల స్థలం వేణుగోపాలస్వామి ఆలయానికే చెందాలని, వదిలే ప్రసక్తే లేదని ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు గోనెల బాలస్వామి, దయాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం సంతకు 12.19 ఎకరాల స్థలాన్ని తహసీల్దార్ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించామని చెప్పిందని.. దానికి బదులుగా పూజారులకు వేరే దగ్గర అంతే స్థలం చూపిస్తామని చెప్పిన విషయాన్ని గోప్యంగా ఉంచడం ఏమిటని ప్రశ్నించారు. 12.19 ఎకరాల స్థలం పూజారులకే చెందుతుందని శుక్రవారం హైకోర్టు తీర్పునివ్వడం విడ్డూరంగా ఉందని.. తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. పెబ్బేరు సంతకు రాష్ట్రంలోనే గుర్తింపు ఉందని, సంతను నమ్ముకొని వేల కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. సంతకు స్థలం లేకుండా చేయడం సరికాదన్నారు. సమావేశంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో భవిష్యత్ బీజేపీదే..



మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

- పంట రుణమాఫీ పేరుతో రైతులను ముంచిన కాంగ్రెస్
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

**నారాయణపేట:** రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ పని అయిపోయిందని.. భవిష్యత్ బీజేపీకే ఉందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని సవాల్ విసిరారు. రైతుభరోసా పేరుతో రైతులను మోసం చేశారని ధ్వజమెత్తారు. మహిళలకు రూ.2,500, యువతులకు స్కూటీ ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. ఉచిత బస్సు పథకం అమలులో విఫలమయ్యారని ఆరోపించారు.

### స్థానిక సంస్థల్లో సత్తా చాటాలి..

జిల్లాలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల పక్షాన ఉండి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. మూడోసారి మోదీ గెలుపులో మహబూబ్‌నగర్ స్థానం ఉండటం శుభపరిణామమని.. పాలమూరు పార్లమెంట్ స్థానంలో బీజేపీ గెలుపు ఆషామాషీ వ్యవహారం కాదని తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీని దెబ్బ తీసేందుకు కాంగ్రెస్ అన్నిరకాల కుట్రలు చేసిందని.. 20 వేల మెజార్టీ ఇచ్చిన నారాయణపేట ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగూరావు నామాజీ, రతంగ్‌పాండురెడ్డి, కొండయ్య, సత్యయాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంవీఎస్ అభివృద్ధికి పూర్వవిద్యార్థులు కలిసి రావాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బుర్రి వెంకట్‌రామిరెడ్డి

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు కలిసి రావాలని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బుర్రి వెంకట్‌రామిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఎంవీఎస్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. మహబూబ్‌నగర్‌లో డిగ్రీ కళాశాల లేని సందర్భంలో ఎంవీఎస్ కళాశాల 1965లో ఆవిర్భవించిందని, ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్ వంటి విద్యార్థులను అందించిందని, అటువంటి కళాశాలకు పూర్వ విద్యార్థులు ఏదైనా చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. అందుకోసం పూర్వ విద్యార్థులను ఐక్యం చేసేందుకు కొన్ని సంవత్సరాలు కృషి చేసి, సభ్యత్వాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కళాశాల ప్రారంభించి సుమారు 60 ఏళ్లు పూర్తి అవుతున్న నేపథ్యంలో త్వరలో పెద్ద ఎత్తున పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. పూర్వవిద్యార్థుల సహకారంతో కళాశాలలో 500 మంది కూర్చునే విధంగా ఆడిటోరియం, క్యాంటీన్, సోలార్ ప్యానెల్స్ ద్వారా నిరంతర విద్యుత్ సప్లై కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 28న పూర్వ విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించే అంశంపై చర్చిస్తున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులకు ఇప్పటికే వాట్సాప్‌గ్రూప్‌లు, జేపీఎన్‌సీ కళాశాల చైర్మన్ రవి కుమార్ సహకారంతో ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను సైతం ప్రారంభించి అందుబాటులో ఉంచుతామన్నారు. అందులో పేర్లునమోదు చేసుకుని సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు న్యాయవాది మనోహర్‌రెడ్డి, వేణుగోపాల్, జేపీఎన్‌సీ రవికుమార్, కాంగ్రెస్ నాయకులు వినోద్‌కుమార్, చెరుకుపల్లి రాజేష్, కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.